సాక్షి
అనంతపురం

శనివారం । 12 । ఏప్రిల్ । 2025

I



చీనీ టన్ను రూ.22,200

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22,200 పలికాయి.



మరో ఐదు రోజులు వర్షాలు

జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ మేరకు రేకుల కుంట ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
39.2°/21.1°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగుతోంది. ఆగ్నేయం దిశగా గంటకు 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

బాలికపై అత్యాచారం

నార్పల: అభం శుభం తెలియని బాలికపై ఓ కామాంధుడు అత్యాచారం చేశాడు. నార్పల మండల కేంద్రంలో ఈ ఘటన చోటు చేసుకుంది. శుక్రవారం సాయంత్రం పన్నెండేళ్ల బాలిక ఇంటి వద్ద ఒంటరిగా ఆడుకుంటుండగా అటుగా వచ్చిన బుక్కరాయసముద్రం మండలం సంజీవపురం గ్రామానికి చెందిన మహేష్ అనే యువకుడు గమనించి అఘాయిత్యం చేశాడు. కొద్దిసేపటి తర్వాత వచ్చిన కుటుంబ సభ్యులు బాలికకు తీవ్ర రక్తస్రావం అవుతుండడం గమనించి 108 వాహనంలో అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడు మహేష్‌ను డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కౌలుట్లయ్య, ఎస్‌ఐ సాగర్ అదుపులోకి తీసుకుని, పోక్సో కింద కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా మహేష్ తన స్వగ్రామంలో కూడా పలువురిని లైంగికంగా వేధించినట్లు తెలిసింది. పెద్దమనుషులు మందలించినా అతడిలో మార్పు రాకపోవడంతో దేహశుద్ధి కూడా చేశారు.

నేడు ఇంటర్ ఫలితాలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థులకు శుభవార్త. శనివారం ఉదయం 11 గంటలకు ఫలితాలు విడుదల కానున్నాయి. మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం జనరల్, ఒకేషనల్ ఫలితాలు విడుదల చేయనున్నట్లు ఇంటర్ విద్యా మండలి అధికారులు ప్రకటించారు. మార్చి 1 ఉంచి 15 వరకు పరీక్షలు జరిగాయి. మార్చి 17 నుంచి మూల్యాంకనం ప్రారంభమై ఏప్రిల్ 3న ముగిసింది. మూల్యాంకనం ముగిసిన 9 రోజులకు ఫలితాలు విడుదల చేస్తున్నారు. https://resutsbie.ap.gov.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని అధికారులు తెలిపారు. అలాగే మన మిత్ర వాట్సాప్ నంబరు 95523 00009కు ''ఏజీ'' మెసేజ్ పంపితే ఫలితాలు వస్తాయంటున్నారు. ఫలితాల ప్రకటన నేపథ్యంలో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, బంధువుల్లో టెన్షన్ నెలకొంది.

కరువు మండలాల్లో రుణాల రీ షెడ్యూల్

అనంతపురం అర్బన్: కరువు మండలాల్లో రుణాల రీ షెడ్యూల్ అవకాశం కల్పిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ వెల్లడించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రత్యేక జిల్లా కన్సల్టేటివ్ కమిటీ సమావేశం బ్యాంక్, సంబంధిత శాఖల ఆధ్వర్యంలో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కరువు జాబితాలో ప్రకటించిన బెలుగుప్ప, గుంతకల్లు, పెద్దవడుగూరు, తాడిపత్రి, యల్లనూరు, యాడికి, విడపనకల్లు మండలాల్లో రైతులు రుణాలు రీ షెడ్యూల్ చేసుకునే విధంగా ఆర్‌ఎస్‌కే సిబ్బంది ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. నాబార్డ్ రూపొందించిన సంభావ్య లింక్డ్ రుణ ప్రణాళిక పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఎల్‌డీఎం నర్సింగరావు, డీఏఓ ఉమామహేశ్వరి, నాబార్డ్ డీడీఎం అనురాధ, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రాధిక, బీసీ కార్పొరేషన్ డీడీ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పని చేస్తాయి

అనంతపురం టౌన్: రిజిస్ట్రేషన్ కార్యాలయాలు శనివారం పని చేస్తాయని జిల్లా రిజిస్ట్రార్ జి.భార్గవ్ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. రెండో శనివారం అయినప్పటికీ జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అందుబాటులో ఉంటాయన్నారు.



యర్రగుంట గ్రామం వద్ద నేలకొరిగిన వరి పంట

వడగండ్ల వాన.. ఈదురుగాలులు

- దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటలు
- అన్నదాతలకు కోలుకోలేని దెబ్బ
- విరిగి పడిన భారీ వృక్షాలు
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

గాలీవాన బీభత్సం

రాయదుర్గం/కణేకల్లు/ బొమ్మనహాళ్/ బెళుగుప్ప/ కూడేరు/ బ్రహ్మసముద్రం/ శింగనమల: జిల్లా వ్యాప్తంగా గాలీవాన బీభత్సం సృష్టించింది. గురువారం సాయంత్రం, శుక్రవారం వడగండ్ల వాన, ఈదురుగాలులు విధ్వంసం సృష్టించాయి. ఉద్యాన, వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయి. మామిడి కాయలు రాలిపోయాయి. కణేకల్లు మండలంలోని యర్రగుంట, గెనిగెర, కణేకల్లు, గంగలాపురం, బ్రహ్మసముద్రం గ్రామాల్లో గురువారం రాత్రి వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. వడగండ్లు, ఈదురుగాలులకు వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు సుమారు రూ.13.97 కోట్ల మేర నష్టం వాటిల్లింది. యర్రగుంటలో తెల్లారితే వరికోత చేసేందుకు సిద్ధం కాగా... రాత్రికి రాత్రే వడగండ్ల వాన కురిసి పంట మొత్తం తుడిచిపెట్టుకుపోయిందని రైతులు జగన్నాథం, లింగారెడ్డి, వాల్మీకి వంద్రప్ప, కురుబ తిప్పేస్వామి, కె.ఎర్రిస్వామి, కురుబ ఆదెప్ప, బోయ వంద్రప్ప ఆందోళన వ్యక్తం చేశారు.

గోపులాపురంలో బసవరాజుకు చెందిన 6 ఎకరాల్లో అరటితోట, బి.నవీన్ 8, రామక్రిష్ణకు చెందిన 6 ఎకరాల్లో అరటితోట దెబ్బతింది. బొమ్మనహాళ్ మండలం శ్రీధరఘట్ట, గోనేహాళ్, లింగదహాళ్, ఉద్దేహాళ్, ఉప్పరహాళ్, దేవగిరి, ఉంతకల్లు, బండూరు, లింగదహాళ్ తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో కోత దశకు వచ్చిన వరితో పాటు మొక్కజొన్న, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, అక్కడక్కడ చెట్లు కూడా నేలకొరిగాయి. రాయదుర్గం మండలంలోనూ పంటలు దెబ్బతిన్నాయి. బెళుగుప్ప మండలంలోని బెళుగుప్ప, బెళుగుప్ప తండా, నక్కలపల్లి, గుండ్లపల్లి, రమనేపల్లి, బ్రాహ్మణపల్లి, యలగలవంక, శీర్పి, గంగవరం, దుద్దేకుంట, అంకంపల్లి, ఆవులెన్న, రామసాగరం, రమనేపల్లి తదితర గ్రామాల్లో 650 ఎకరాల్లో మొక్కజొన్న, మరో 50 ఎకరాల్లో అరటి తదితర పంటలు ఈదురుగాలులకు నేలవాలాయి. ఇంకా పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు పడిపోయాయి.

ఇదిలా ఉండగా వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్టం అంచనా వేశారు. బొమ్మనహాళ్ మండలం గోనేహాళ్ వద్ద దెబ్బతిన్న వరి పంట పొలాలను ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పరిశీలించారు. బ్రహ్మసముద్రం మండలం కుర్లగుండ, నాగిరెడ్డిపల్లి, గుండిగానిపల్లి, ఎర్రకొండాపురం తదితర గ్రామాల్లో బొప్పాయి, అరటి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. కూడేరు మండలం కడదరగుంట, పి.నారాయణపురం, ఎంఎం హళ్లి, మరుట్ల–1, 2, 3 కాలనీలు, చోళసముద్రం, ముద్దలాపురం, మరికొన్ని గ్రామాల్లో పెనుగాలులకు అరటి, మొక్కజొన్న, బ్యాడిగి మిర్చి తదితర పంటలు దెబ్బతిన్నాయి. శింగనమల మండలంలో వివిధ రకాల పంటలకు నష్టం వాటిల్లింది. తరిమెలలో శుక్రవారం సాయంత్రం గాలీవానకు పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు రోడ్లపై అడ్డంగా పడిపోయాయి.

రైతులకు పరిహారం అందించాలి



రాయదుర్గం నియోజకవర్గంలో కురిసిన వడగండ్ల వర్షం, ఈదురుగాలుల బీభత్సానికి పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వ పరిహారం అందించి ఆదుకోవాలి. బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో చేతికొచ్చిన వరి పంట నేలపాలు కావడం బాధాకరం. రాయదుర్గం, గుమ్మఘట్ట, డీ హీరేహాళ్ మండలాల్లోనూ మొక్కజొన్న, ఉద్యాన పంటలు దారుణంగా దెబ్బతిన్నాయి. ప్రతి రైతుకూ న్యాయం చేకూర్చేలా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశాం.

– మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, రాయదుర్గం





బొమ్మనహాళ్ సమీపంలో గురువారం రాత్రి పడిన వడగండ్లు, నక్కలపల్లిలో నేలవాలిన మొక్కజొన్న



తరిమెలలో పడిపోయిన విద్యుత్ స్తంభం



గుండిగానిపల్లిలో విరిగిపడిన బొప్పాయి చెట్లు

ఈదురుగాలులకు రూ.8.83 కోట్ల పంట నష్టం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో వారం రోజులుగా ఈదురుగాలుల తాకిడితో వ్యవసాయ పంటలకు రూ.8.83 కోట్లు మేర నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. శెట్టూరు, నార్పల, గార్లదిన్నె, అనంతపురం, శింగనమల, కంబదూరు, కణేకల్లు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, బొమ్మనహాళ్, బెలుగుప్ప, డీ.హీరేహాళ్ తదితర మండలాల పరిధిలో 51 గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అంచనా వేశామన్నారు. మొత్తంగా 881 మంది రైతులకు చెందిన 1,136 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. ఇందులో 659 హెక్టార్లలో మొక్కజొన్న నేలవాలడంతో 603 మంది రైతులకు రూ.5.60 కోట్లు మేర నష్టం జరిగిందన్నారు. 239 మంది రైతులకు చెందిన 383 హెక్టార్లలో వరి దెబ్బతినడంతో రూ.275 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందన్నారు. 39 మంది రైతులకు చెందిన 94 హెక్టార్లలో పత్తి దెబ్బతినడంతో రూ.47 లక్షలకు పైగా నష్టం జరిగినట్లు అంచనా వేశామని పేర్కొన్నారు.

కుప్పకూలిన గాలిమర



పుట్లూరు: ఎ.కొండాపురం వద్ద కొండలపై ఏర్పాటు చేసిన గాలిమర కుప్పకూలింది. వివరాలు ఇలా ఉన్నాయి. 1999లో బీహెచ్ఈఎల్‌కు చెందిన 16 గాలిమరలను కొండలపై ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులుకు ఒక గాలిమర కుప్పకూలిపోయింది. ఆ సమయంలో సిబ్బంది లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదం వల్ల రూ.50 లక్షల మేర నష్టం చేకూరినట్లు సిబ్బంది చెబుతున్నారు.

బీసీల ప్రయోజనాలకు కూటమి విఘాతం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్న పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు అనంత, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం బీసీల ప్రయోజనాలకు విఘాతం కలిగించే చర్యలు చేపడుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావ్ పూలే జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి అనంత పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావ్ పూలే గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. దురాచారాలను రూపుమాపేందుకు ఎన్నో పోరాటాలు చేశారన్నారు. పూలే స్ఫూర్తితో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. బడుగు, బలహీనల వర్గాలు అన్ని విధాలా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకున్నారన్నారు. విద్యలో నూతన సంస్కరణలు తీసుకువచ్చి, పేదలకు కార్పొరేట్ స్థాయి విద్యనందించేలా చూశారన్నారు. మహిళలకు రాజకీయంగా అవకాశాలు కల్పించి, స్థానిక సంస్థల్లో, కార్పొరేషన్, మునిసిపాలిటీల్లో 50 శాతంకుపైగా రిజర్వేషన్ కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం బడుగులను నట్టేట ముంచుతోందన్నారు. ఎన్నికలకు ముందు అలివిగాని హామీలను ప్రకటించి ఇప్పుడు డైవర్షన్ పాలిటిక్స్‌తో కాలయాపన చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం మెడలు వంచైనా బడుగులకు మేలు చేసేలా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. పూలే ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణవేణి, అనుబంధ సంఘాల అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు, శ్రీదేవి, వైపీ బాబు, అమర్‌నాథ్‌రెడ్డి, నేతలు ఉమ్మడి మదన్ మోహన్‌రెడ్డి, పెన్నోబులేసు, మాల్యవంతం మంజుల, మీసాల రంగన్న, పామిడి వీరాంజనేయులు, కేశవరెడ్డి, తలారి వెంకటేష్, చింతకుంట మధు, అనిల్‌కుమార్ గౌడ్, ఆసిఫ్, రాధాకృష్ణ, సాదిక్, కార్పొరేటర్లు రహంతుల్లా, రాజేశ్వరి, దుర్గాదేవి, సుమతి, తదితరులు పాల్గొన్నారు.

11 మండలాల్లో నీటిమట్టం తగ్గుముఖం

- 13 గ్రామపంచాయతీల్లో బోరుబావుల తవ్వకం నిషేధం
- జూన్‌లో భూగర్భజలాలు పెరిగే చాన్స్



అనంతపురం అగ్రికల్చర్: భూగర్భజలాల పరిస్థితి ఆశాజనకంగానే కనిపిస్తున్నా.. 11 మండలాల్లో నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. భూగర్భజలశాఖ తాజాగా 97 ఫిజోమీటర్ల నుంచి సేకరించిన గణాంకాల ప్రకారం జిల్లా సగటు నీటిమట్టం 11.86 మీటర్లుగా నమోదైంది. సగటు నీటి మట్టం కన్నా 11 మండలాల్లో భూగర్భజలాలు కాస్తంత తగ్గుముఖం పట్టినట్లు స్పష్టమవుతోంది. ఈ వర్షపు సంవత్సరంలో ఇప్పటి వరకు 463.1 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉడగా 30.3 శాతం అధికంగా అంటే 603.6 మి.మీ నమోదైంది. దీంతో పాతాళగంగ పరిస్థితి కొంత మెరుగ్గానే ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా అంతటా 40.94 టీఎంసీలు అందుబాటులో ఉండగా అందులో 14.45 టీఎంసీలు వినియోగిస్తున్నారు. ఇంకా 26.49 టీఎంసీల భూగర్భజలాలు మిగులు కింద ఉన్నట్లు ఆ శాఖ అధికారులు నివేదికలో పేర్కొన్నారు.

డేంజర్ జోన్‌లో నార్పల

అత్యధిక నీటివినియోగం కలిగిన నార్పల మండలం పూర్తి డేంజర్ జోన్‌లో ఉంది. అలాగే బ్రహ్మసముద్రం, డీ.హీరేహాళ్, కళ్యాణదుర్గం, కూడేరు, కుందుర్పి, పామిడి, పుట్లూరు, శెట్టూరు, తాడిపత్రి, యాడికి మండలాల్లో కూడా నీటి వినియోగం అధికంగా ఉండటంతో భూగర్భజలాలు తగ్గుముఖం పడుతున్నట్లు గుర్తించారు. 20 మండలాల్లో ఫిజోమీటర్ల ద్వారా 8 నుంచి 20 మీటర్లలో నీటిమట్టం కనిపిస్తోందని చెబుతున్నారు.

- జిల్లా వ్యాప్తంగా బోరుబావులు 1,87,610 వినియోగిస్తుండగా, భూమి, నీరు, చెట్టు చట్టం (వాల్టా) కింద 13 గ్రామ పంచాయతీల్లో బోరుబావుల తవ్వకాన్ని నిషేధించారు. వేసవి కావడం వల్ల ఏప్రిల్, మే నెలల్లో మరింత తగ్గుముఖం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. వర్షాలు వచ్చే పరిస్థితి ఉన్నందున జూన్ నుంచి తిరిగి భూగర్భజలాలు పెరగవచ్చని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

కలంపై జులుమా..?

- సాక్షి ఎడిటర్‌పై కేసు అప్రజాస్వామికం
- వెంటనే కేసులు ఎత్తివేయాలి
- అనంతపురంలో జర్నలిస్టుల నిరసన



అనంతపురంలో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

అనంతపురం : ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియాపై కూటమి సర్కార్ కక్షపూరిత చర్యలను జర్నలిస్టులు నిరసించారు. పల్నాడు జిల్లాలో ఓ హత్యకు సంబంధించి వాస్తవాలను వార్తగా ప్రచురించినందుకు 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డితో పాటు ఆరుగురు జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కేసు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం అనంతపురంలో జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సాక్షి ఎడిటర్ సహా పాత్రికేయులపై పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అరాచకాలకు వ్యతిరేకంగా యావత్ పౌర సమాజం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం జర్నలిస్టులు ర్యాలీగా వెళ్లి డీఐజీ షిమోషికి వినతిపత్రాన్ని అందజేశారు. సాక్షి ఎడిటర్, జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసు ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో సాక్షి టీవీ కరస్పాండెంట్ శివారెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జ్ తోలేటి మహేశ్వరరెడ్డి, జర్నలిస్టులు వై.సాయినాథ్‌రెడ్డి, బన్సీలాల్ నాయక్, బడా శ్రీనివాసరెడ్డి, బాలకృష్ణారావు, రమణారెడ్డి, రామలింగారెడ్డి, నగేష్, మురళీ కృష్ణ, ఎల్లప్ప, సంగప్ప, వీరేష్, రాము, చింబిలి రంగనాథ్, శ్రీనివాసరెడ్డి సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడం



ఆంధ్రప్రదేశ్‌లో మీడియా స్వేచ్ఛను హరించేలా ఎన్నడూ లేని విధంగా సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి, మరో ఆరుగురు జర్నలిస్టులపై కేసు పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఏపీడబ్ల్యూజేయూ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి అన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మీడియా స్వేచ్ఛ గురించి మాట్లాడిన వారు అధికారంలోకి వచ్చాక అదే మీడియా మీద దౌర్జన్యకాండ, అక్రమ కేసులు పెడుతూ భయపెట్టే ప్రయత్నం చేస్తోందని, ఇది సమాజానికి, ప్రభుత్వానికి ఎంతమాత్రమూ మంచిది కాదన్నారు. సాక్షి ఎడిటర్‌పై పెట్టిన కేసును ప్రభుత్వమే బేషరతుగా ఉపసంహరించుకోవాలన్నారు. లేకుంటే జర్నలిస్టుల ఆందోళన ప్రజాసంఘాల మద్దతుతో ఉద్యమ రూపం దాలుస్తుందన్నారు. వార్తల విషయంలో ఏదైనా అభ్యంతరం ఉంటే ప్రెస్ కౌన్సిల్‌లో ఫిర్యాదు లేదా లీగల్‌గా వెళ్లవచ్చు కానీ.. ఎడిటర్ మీదే కేసులు పెట్టడమేంటని నిలదీశారు.

జర్నలిస్టులపై కేసులు మంచిదికాదు



జర్నలిస్టులపై కేసులు పెట్టే సంస్కృతి మంచిదికాదని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్ అన్నారు. ఇలా కేసులు పెట్టుకుంటూ పోతే వార్తలు రాయడానికి జర్నలిస్టులు మిగలరన్నారు. వార్తలు రాసినంత మాత్రాన కేసులు పెట్టడం.. ముఖ్యంగా ఎడిటర్‌పై కేసులు పెట్టడం సరైనది కాదన్నారు. వెంటనే కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు స్వేచ్ఛగా వార్తలు రాసే వాతావరణం కల్పించాలని కోరారు. జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేసే సంస్కృతి వీడాలన్నారు.

ఇదో చీకటి రోజు



జరిగిన సంఘటనను ప్రచురించినందుకు సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి, జర్నలిస్టులపై ఆగమేఘాలపై రాత్రికి రాత్రే కేసు పెట్టడాన్ని చీకటి రోజుగా భావిస్తున్నామని సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ గుండం రామచంద్రారెడ్డి (ఆర్‌సీఆర్) పేర్కొన్నారు. ఎడిటర్‌పై కేసులు పెడితే వార్తలు ఆగుతాయనేది భ్రమ మాత్రమేనన్నారు. అలాంటి కేసులకు భయపడే పరిస్థితి ఎక్కడా ఉండదని గుర్తుంచుకోవాలన్నారు. పల్నాడు జిల్లాలో జరిగిన హత్య ఘటనను సాక్షి ప్రచురించిందని, అయితే నిందితులను పట్టుకోవాల్సిన పోలీసులు.. వార్తను ప్రచురించిన ఎడిటర్‌పై కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. బాధితులు ఎవరు అనేది తెలుసుకుని.. వారి పక్షాన పోలీసులు నిలబడాలని హితవు పలికారు.

పూలే ఆశయాలు కొనసాగించాలి



పూలే విగ్రహానికి నివాళులర్పించిన మంత్రి కేశవ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం సిటీ: మహాత్మ జ్యోతిబా పూలే ఆశయాలు కొనసాగించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. పూలే జయంతిని పురస్కరించుకొని జిల్లా పరిషత్ క్యాంపస్‌లో గల ఆయన విగ్రహానికి శుక్రవారం మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, కలెక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రాజోలి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఆర్డీఓ గుత్తా కేశవనాయుడు, బీసీ వెల్ఫేర్ డీడీ ఖుష్బూ కొఠారి, డీటీడబ్ల్యూఓ బోయ రామాంజనేయులు పాల్గొన్నారు.

అనంతపురం అర్బన్: బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో నిర్వహించిన జ్యోతిబా పూలే జయంతిలో ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, కలెక్టర్ వినోద్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై నివాళులర్పించారు.

క్లుప్తంగా

బాల కార్మికులకు పునరావాసం కల్పించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం సిటీ: జిల్లాలో బాల కార్మికులకు సంబంధించిన సమగ్ర సమాచారం సేకరించి, వారికి పునరావాసం కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అంశంపై కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం సమావేశం జరిగింది. జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మతో కలసి కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి బాల కార్మికుని ప్రొఫైల్, ట్రాక్ రికార్డు మెయింటెన్ చేయాలన్నారు. ప్రాసిక్యూషన్, మినిమం వేజెస్, బాల కార్మికులకు అందజేసిన సహాయక చర్యలకు సంబంధించిన నివేదికలను సమర్పించాలన్నారు. ప్రతి బాల కార్మికుడిని పునరావాసం కల్పించి, తిరిగి పని ప్రదేశానికి వెళ్లకుండా కావాల్సిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ–శ్రమ్ పోర్టల్ ద్వారా అర్హత కలిగిన అసంఘటిత రంగ కార్మికులందరి వివరాలు నమోదు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, మున్సిపల్, ప్లాన్ అప్రూవల్ అథారిటీలందరూ ప్రతి నిర్మాణంపై మొత్తం వ్యయంలో ఒక శాతం సెస్‌ను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు జమ చేయాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ లలిత, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, కార్మిక శాఖ అధికారులు లక్ష్మీనర్సయ్య, రాధా రమాదేవి, సుజాత, ప్రతాప్ నాయుడు, వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, డీఈఓ ప్రసాద్, చేనేత శాఖ ఏడీ శ్రీనివాసరెడ్డి, డ్వామా, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కలల సాకారానికి ఈ–సెట్

- ఇంజినీరింగ్ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ ద్వారా సెకండియర్‌లోకి అడ్మిషన్
- డిప్లొమా, బీఎస్సీ మ్యాథ్స్ విద్యార్థులకు సువర్ణ అవకాశం
- జేఎన్‌టీయూ(ఏ) ఆధ్వర్యంలో ఏపీ ఈసెట్ నిర్వహణ



జేఎన్‌టీయూ(ఏ) అడ్మిషన్స్ బ్లాక్ భవనం

అనంతపురం: ఉన్నత కలలకు ఏపీ ఈ–సెట్ తొలి మెట్టుగా నిలుస్తోంది. పేరెన్నికగల కళాశాలల్లో బీటెక్, బీఈ పూర్తి చేయాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. అదే ఏపీ ఈఏపీసెట్ (ఎంసెట్) ద్వారా గణనీయమైన ర్యాంకు సాధిస్తే ఈ కలను సాకారం చేసుకోవచ్చు. అయితే ఈఏపీసెట్‌కు పోటీ అధికంగా ఉంటుంది. కానీ, మంచి కళాశాలల్లో ఇంజినీరింగ్ సీటు దక్కించుకునేందుకు ఏపీ ఈ–సెట్ మరో చక్కటి మార్గం. ఏపీ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఈ–సెట్)లో సత్తా చాటితే నేరుగా బీటెక్ సెకండియర్‌లో అడ్మిషన్ పొందవచ్చు. డిప్లొమా పూర్తి చేసిన వారు, బీఎస్సీ(మేథమేటిక్స్) పూర్తి చేసినవారు ఇందుకు అర్హులు. ఫార్మసీ కోర్సుల్లో సైతం అడ్మిషన్లు పొందడానికి ఈ–సెట్ దోహదపడుతుంది. యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలల్లోనూ సీట్లు దక్కించుకోవచ్చు. మొత్తం సీట్లలో 10 శాతం ఈ–సెట్ ర్యాంకర్లకు కేటాయిస్తున్నారు. దీంతో ఈ–సెట్ అనేది డిప్లొమా విద్యార్థులకు వరంలా మారింది.

లేటరల్ ఎంట్రీ ద్వారా అవకాశం

ఇంజినీరింగ్ కోర్సులో లేటర్ ఎంట్రీ ద్వారా రెండో సంవత్సరంలోకి అడ్మిషన్ పొందడానికి అవకాశం కల్పిస్తూ నిర్వహిస్తున్న ఏపీ ఈ–సెట్–2025కు భారీగా దరఖాస్తులు అందాయి. ఈ ఏడాది మొత్తం 33,454 మంది దరఖాస్తు చేసుకున్నారు. అగ్రికల్చర్ ఇంజినీరింగ్ విభాగానికి–143, బీఎస్సీ(మేథమేటిక్స్) –41, సిరామిక్ టెక్నాలజీ–3, కెమికల్ ఇంజినీరింగ్ –290, సివిల్ ఇంజినీరింగ్ –2,874, కంప్యూటర్ సైన్సెస్–10,639, ఈఈఈ–5492, ఈసీఈ–9,024, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ –54, మెకానికల్ ఇంజినీరింగ్ –4,424, మెటలార్జీ –97, మైనింగ్–66, ఫార్మసీ విభాగానికి –307 చొప్పున మొత్తం 33,454 దరఖాస్తులు అందాయి. దరఖాస్తు చేసుకునేందుకు గడువును మరింత పెంచడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. ఈ నెల 12వ తేదీ వరకు రూ.వెయ్యి అపరాధ రుసంతో దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే 17వ తేదీ వరకు రూ.2వేలు, 24వ తేదీ వరకు రూ.4వేలు, 28వ తేదీ వరకు రూ.10 వేల అపరాధ రుసుంతో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న వారికి మే 6వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.

జేఎన్‌టీయూకు అవకాశం

ఏపీ ఈ–సెట్‌ను ఇప్పటి వరకూ 8 దఫాలుగా నిర్వహించే అవకాశం జేఎన్‌టీయూ (ఏ)కు దక్కింది. 2015 నుంచి 2020 వరకు ఏపీ ఈసెట్‌ను రాష్ట్ర కన్వీనర్‌గా ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి , 2021లో ప్రొఫెసర్ సి. శశిధర్, 2024లో ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి విజయవంతంగా నిర్వహించారు. తాజాగా ప్రొఫెసర్ దుర్గాప్రసాద్‌ను ఈసెట్ కన్వీనర్‌గా నియమించారు.

క్రేజీ కంప్యూటర్ సైన్సెస్

ఇంజినీరింగ్‌లో కంప్యూటర్ సైన్సెస్‌కు విపరీతమైన క్రేజ్ ఉంది. ఈ నేపథ్యంలో బీటెక్ కంప్యూటర్ సైన్సెస్ కోర్సుల్లో అడ్మిషన్ పొందాలంటే ఏపీఈఏపీ సెట్‌లో గణనీయమైన ర్యాంక్‌ను సాధించాల్సి ఉంటుంది. అదే డిప్లొమో కంప్యూటర్ సైన్సెస్ పూర్తి చేసిన వారు ఈ–సెట్ ద్వారా మంచి కళాశాలల్లో కంప్యూటర్ సైన్సెస్ కోర్సు దక్కించుకోవచ్చు. గతేడాది కంటే ఈ ఏడాది ఈ–సెట్ కంప్యూటర్ సైన్సెస్ బ్రాంచ్‌కు దరఖాస్తులు పెరగడమే ఇందుకు కారణం.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో చోటు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనంతపురం జిల్లాకు చెందిన కొందరికి రాష్ట్ర అనుబంధ విభాగాల్లో చోటు కల్పిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా ఇండ్ల విజయ్‌కుమార్‌రెడ్డి, మహమ్మద్ సుల్తాన్ మొహిద్దీన్ ఆదాం, కె.హనుమంతరెడ్డి, బంగారు వంశీయాదవ్, సహాయ కార్యదర్శిగా బన్వంత్ కాశీరామ్‌నాయక్, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా బి.కిరణ్ కుమార్, సహాయ కార్యదర్శిగా చాపిడి వెంకట రంగారెడ్డి, క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా వై. జాన్‌విజయకుమార్, దార్ల పురుషోత్తం, చిలకల థామస్ రాజ్‌కుమార్ నియమితులయ్యారు.

బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా గురుప్రసాద్

అనంతపురం: అనంతపురం బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా పి.గురుప్రసాద్ విజయం సాధించారు. శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి పోటీ చేసిన ఆయనకు 333 ఓట్లు, బి.మల్లికార్జునకు 167, జి.శ్రీధర్‌రెడ్డికు 115, ఎస్.సుబ్రహ్మణ్యంకు 18 ఓట్లు దక్కాయి. జనరల్ సెక్రెటరీగా ఈ. వెంకట్రాముడు ఎన్నికయ్యారు. జనరల్ సెక్రెటరీగా పోటీ చేసిన వారిలో ఈ.వెంకట్రాముడు 234కు ఓట్లు రాగా, ఎల్.రాజీవ్‌రెడ్డికు 169, కె.రాజేంద్రప్రసాద్‌కు 162, వై.గోవిందరాజులుకు 75 ఓట్లు వచ్చాయి. వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్కే ధర్మసింగ్ నాయక్, ట్రెజరర్‌గా వెంకట రఘుకుమార్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీగా పి. విజయ్‌భాస్కర్ గెలుపొందారు.

నామమాత్రంగా అహుడా సమావేశం

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం–హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అహుడా) అభివృద్ధికి సంబంధించి శుక్రవారం అహుడా చైర్మన్ టీసీ వరుణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం నామమాత్రంగానే సాగింది. అహుడా పరిధిలో నెలకొన్న అనధికార లే అవుట్లు, అహుడా ఆధ్వర్యంలో చేపట్టిన లే అవుట్ల అభివృద్ధిపై పెద్దగా చర్చ జరగలేదు. ఇటీవల జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ఎంఐజీ లేఅవుట్లలో చేపట్టే అభివృద్ధి పనులపై కనీస చర్చ కూడా చేయలేదు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ, అహుడా కార్యదర్శి గౌరీశంకరరావు, పీఓ ఇషాక్‌అహమ్మద్, ఈఈ దుశ్యంత్, ఆన్‌లైన్ ఓఎస్‌డీ వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన రైతులూ అప్రమత్తంగా ఉండండి


అనంతపురం అగ్రికల్చర్: వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, పెను గాలులు, వడగండ్లు, అకాల వర్షాలు నమోదవుతున్న నేపథ్యంలో ఉద్యాన తోటలు సాగు చేస్తున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని రెండు జిల్లాల ఉద్యానశాఖ అధికారులు జి.చంద్రశేఖర్, జి.ఫిరోజ్‌ఖాన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధానంగా పంట చేతికివచ్చే సమయం కావడంతో చీనీ, మామిడి, అరటి, బొప్పాయి, రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అరటి, బొప్పాయి పంటలు నేలవాలకుండా సరైన పోట్లు ఏర్పాటు చేసుకుంటే నష్ట తీవ్రత బాగా తగ్గుతుందని తెలిపారు. తోట చుట్టూ వెలుపలి ప్రాంతంలో నీటి తడి ఇస్తే సుడిగాలి తీవ్రత బాగా తగ్గిపోతుందన్నారు. పెను గాలులకు దెబ్బతిన్న తోటల్లో వెంటనే కాయలు, గెలలు తొలగించి, కొమ్మలను బయట పడేయాలన్నారు. చీడ పీడల బారి నుంచి రక్షించుకునేందుకు లీటర్ నీటికి 2.5 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలన్నారు. నిల్వ ఉన్న వర్షపు నీరు ఆవిరైన తర్వాత పైపాటుగా ఎకరాకు 10 కిలోల యూరియా చల్లుకోవాలన్నారు. తోటల చుట్టూ అవిశె, సుబాబుల్ లాంటి రక్షణ పంటలు వేసుకుంటే పెనుగాలుల బారి నుంచి పంటలను కాపాడుకోవచ్చన్నారు. అవకాశం ఉన్న రైతులు కొన్ని మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే వేసవి సమస్యల నుంచి గట్టెక్కవచ్చని పేర్కొన్నారు.



అరటికి పోట్లు పెట్టిన దృశ్యం

జగన్‌ను విమర్శించే స్థాయి నీకెక్కడది?

- ఎస్ఐ సుధాకర్ యాదవ్‌పై ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మండిపాటు
- తప్పు చేస్తే పోలీసులైనా చట్టం ముందు సమానమే
- నేర నిరూపణ అయితే యూనిఫాం తీసేసి శిక్ష అనుభవించాల్సింది



ఉరవకొండ: జనంలో అత్యంత ప్రజాదరణ కలిగిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్‌కు లేదని శాసనమండలి ప్రివిలైజ్ కమిటీ చైర్మెన్/ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని తన స్వగృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీకి తొత్తులుగా మారిన కొందరు పోలీసులను ఉద్దేశించి తప్పు చేసిన పోలీసులైన చట్టం ముందు సమానమేనని, వారి యూనిఫాం తీసేయిస్తామని వైఎస్ జగన్ వ్యాఖ్యానిస్తే... దానిని కూటమి ప్రభుత్వం వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పోలీసు వ్యవస్థ నిర్వీర్యమైందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతిపక్ష నేతలుగా చంద్రబాబు, లోకేష్, పవన్‌కళ్యాణ్‌కు పటిష్ట భద్రతను అప్పటి సీఎం వైఎస్ జగన్ కల్పించారని గుర్తు చేశారు. ఈ అంశంపై అప్పట్లో ఒక్క ఆరోపణ కూడా లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో అడుగడుగునా భద్రతా వైఫల్యం కనిపిస్తోందన్నారు. వైఎస్ జగన్ పాపిరెడ్డిపల్లి పర్యటనలో 1,100 మంది పోలీసులను, 200 మందిని హెలిప్యాడ్ వద్ద ఏర్పాటు చేసినట్లుగా పేర్కొంటూ భద్రతా వైఫల్యాన్ని కప్పి పుచ్చుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కేవలం అభిమానులను, కార్యకర్తలను ఆపడానికి పోలీసులను మోహరించారు కానీ, మాజీ సీఎం భద్రతకు కాదనే విషయం క్షేత్ర స్థాయిలో బట్టబయలైందన్నారు. వైఎస్ భారతిపై ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఏ పార్టీలోనైనా మహిళల వ్యక్తిత్వాన్ని తప్పు పట్టేలా వ్యాఖ్యలు చేయడం తగదని, ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

‘అనంత’లో జోయాలుక్కాస్ షోరూం ప్రారంభం

- ప్రదర్శనలో 150 కేజీల బంగారం, వజ్రాలు, వెండి ఆభరణాలు



ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న జోయాలుక్కాస్ చైర్మన్ జాయ్ అలూక్కాస్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: బంగారు, వజ్రాభరణాల అతి పెద్ద షోరూంల్లో ఒక్కటైన జోయాలూక్కాస్... అనంతపురంలోని రాజు రోడ్డులో తన నూతన బ్రాంచ్‌ను శుక్రవారం ప్రారంభించింది. జోయాలుక్కాస్ గ్రూప్ ఆఫ్ చైర్మన్, ఎండీ జాయ్ అలూక్కాస్‌తో కలసి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింధూరరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన జోయాలుక్కాస్ షోరూంను జిల్లాలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జోయాలుక్కాస్ ఎండీ మాట్లాడుతూ.. ఇప్పటి వరకూ దేశ వ్యాప్తంగా 175 షోరూంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తక్కువ బరువుతో ఉన్న ప్రపంచ స్థాయి మోడల్స్‌తో డైమండ్, గోల్డ్, సిల్వర్ జ్యువెలరీను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అనుగ్రహ టెంపుల్ జ్యువెలరీ, ప్రైడ్ డైమండ్స్, ఎలిగంజా పోల్కి డైమండ్స్, యవ ఏన్విరిడే జ్యువెలరీ, అపూర్వ యాంటిక్ కలెక్షన్, రత్న ప్రెషన్ స్టోన్ జ్యూవెలరీ తదితర 150 కిలోల ఆభరణాలను ప్రదర్శనలో ఉంచామన్నారు. తమ ఉత్పత్తులకు రిటర్న్ విలువ ఉంటుందన్నారు.

కంది పంట రాబడిని అపహరించిన సైబర్ నేరగాళ్లు

బెళుగుప్ప: ఆరుగాలం శ్రమించి సాధించిన కంది పంట రాబడిని సైబర్ నేరగాళ్లు అపహరించారు. వివరాలు. బెళుగుప్పకు చెంది మహిళా రైతు నిర్మలమ్మ తనకున్న పొలంలో కంది పంట సాగు చేశారు. ఈ క్రమంలో పంట చేతికి రాగా, మార్కెట్‌లో విక్రయించగా వచ్చిన రూ.1.34 లక్షలను స్థానిక ఎస్‌బీఐ శాఖలోని తన ఖాతాలో జమ చేశారు. ఈ నెల 9న అర్ధరాత్రి వరుసగా మూడు మెసేజ్‌లు రావడంతో ఆమె పరిశీలించారు. రూ.24,500, రూ.24,960, రూ.50వేలు చొప్పున మొత్తం రూ.99,460 నగదు విత్‌డ్రా అయినట్లుగా తెలుసుకున్న ఆమె కంగుతిని, మరుసటి రోజు ఉదయమే బ్యాంక్‌కు వెళ్లి ఆరా తీశారు. ఖాతాలో లావాదేవీలను పరిశీలించిన బ్యాంక్ అధికారులు... న్యూఢిల్లీలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లోని ఓ ఖాతాకు బదిలీ అయినట్లు తెలిపారు. ఇది సైబర్ నేరగాళ్ల పనిగా నిర్ధారించడంతో శుక్రవారం పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు.

వైభవంగా సీతారామాంజనేయ విగ్రహ ప్రతిష్ట





ఆలయంలో ప్రతిష్ఠించిన విగ్రహాలు. కల్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరి సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో 3 రోజుల పాటు ఆగమ శాస్త్ర సంప్రదాయాలతో పూజలు జరిగాయి. ఆలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, వైఎస్సార్ సీపీ ఎస్ఆర్ఐ విభాగం కో–ఆర్డినేటర్ ఆలూరి సాంబశివారెడ్డి రూ.30 లక్షల విరాళం ఇచ్చారు. శుక్రవారం ఆలయంలో మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరి సాంబశివారెడ్డి, ఆలూరి రమణారెడ్డి ప్రత్యేక పూజల అనంతరం నేత్రపర్వంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మాట్లాడుతూ రోటరీపురంలో ఎంతో సుందరంగా సీతారామాలయం రూపుదిద్దుకోవడం అభినందనీయమన్నారు. గ్రామంలో శనివారం రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వేడుకలకు వేళాయె..

- భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న చౌడేశ్వరీదేవి
- 16న శ్రీజ్యోతి ఉత్సవం

సందర్భం నేటి నుంచి అమడగూరు చౌడేశ్వరీ ఉత్సవాలు



అమడగూరులో ప్రసిద్ధిగాంచిన చౌడేశ్వరీ ఆలయం

ఆలయంలో కొలువుదీరిన చౌడేశ్వరీ మూలవిరాట్

అమడగూరు: ఉమ్మడి జిల్లాలోనే అతి పెద్ద ఉత్సవాలకు పేరొందిన అమడగూరు చౌడేశ్వరీ దేవి ఉత్సవాలకు వేళైంది. దాదాపు ఎనిమిది శతాబ్దాల క్రితం అమరావతిగా పిలువబడిన అమడగూరులో వెలసిన చౌడేశ్వరీ ఆలయానికి ఎంతో విశిష్ట చరిత్ర ఉంది. భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న ఈ ఆలయంలో ఏటా చైత్ర మాసంలో ఆలయ కమిటీ సభ్యులు, అమడగూరు, చీకిరేవులపల్లి, గుండువారిపల్లి గ్రామ పంచాయతీ ప్రజల ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలను 8 రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఉత్సవాలకు ఉమ్మడి జిల్లా నుంచే కాక.. ఏపీలోని పలు రాష్ట్రాలకు చెందిన భక్తులు, తమిళనాడు, కర్ణాటక, కేరళ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేస్తుంటారు.

అమ్మవారి ఉత్సవాల వివరాలు

ఏటా చైత్ర మాసంలో ఉగాది పండుగ సందర్భంగా అమ్మవారిని 16 గ్రామాల ఊరేగింపునకు తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఆ తర్వాత వచ్చే పున్నమితో ఎప్పటి లాగానే సంప్రదాయబద్ధంగా నిర్వహించే అమ్మవారి ఉత్సవాలు ఈ ఏడాది కూడా శనివారంతో ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల వివరాలను ఆలయ ధర్మకర్త, మాజీ జెడ్పీటీసీ పొట్టా పురుషోత్తమరెడ్డి వెల్లడించారు. 12న కుంభకూడు, 13న ఊయల సేవ, 14న సూర్యప్రభ, 15న చంద్రప్రభ, 16న శ్రీజ్యోతి ఉత్సవం, 17న అశ్వ వాహనం, 18న సింహ వాహనం, 19న హంస వాహన సేవలు ఉంటాయి.

ఉత్సవాలకే తలమానికంగా..

అమ్మవారి ఉత్సవాలలో భాగంగా ఈ నెల 16న నిర్వహించే శ్రీజ్యోతి ఉత్సవానికి ఎంతో విశిష్టత ఉంది. ఈ ఉత్సవాన్ని ఏటా కొత్తపల్లికి చెందిన దంపతులు మాజీ జెడ్పీటీసీలు పొట్టా పురుషోత్తమరెడ్డి, ఉమాదేవి కుటుంబసభ్యులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాన్ని చూసేందుకు 4 రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. ఆ రోజు ఉట్టి వద్ద నుంచి తీసుకొచ్చే జ్యోతి దర్శనంతో సకల పాపాలు తొలగి మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం. ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్నదానంతో పాటు కాలక్షేపానికి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

క్లుప్తంగా

ఉచితంగా బ్రాహ్మణ ఉపనయనాలు

అనంతపురం కల్చరల్: విశ్వవిద్య మహాపరిషత్తు ఆధ్వర్యంలో ఈనెల 30న పాతూరులోని ఉత్తరాధిమఠం (మూలాంజనేయస్వామి ఆలయం)లో సామూహిక ఉచిత ఉపనయనాలు నిర్వహిస్తున్నట్లు మఠం ప్రతినిధులు గురురాజ్, పద్మనాభాచార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్రాహ్మణ వటువులకు అవసరమైన సామగ్రి, వారి పరివారానికి తీర్థ ప్రసాదాలు మఠం వారే సమకూరుస్తారని పేర్కొన్నారు. 9704315757, 9441230303 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అనంతపురం కల్చరల్: నగరంలోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం సీతారాముల తిరు కల్యాణ మహోత్సవం వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ కమనీయంగా జరిగింది. అర్చకుడు హర్షశర్మ రాములోరి పరిణయ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సర్వాంగ సుందరంగా అలంకార భూషితులైన సీతారాములను పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. సాయంత్రం చంద్రప్రభ వాహనంపై సీతారాములు నగరవీధుల్లో విహారం చేసి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు సంప్రదాయ గీతాలాపనతో స్వామికి భక్తినీరాజనాలర్పించారు. కార్యక్రమంలో ఈఓ శోభ, భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

13న రెడ్డి వివాహ పరిచయ వేదిక

రాప్తాడురూరల్: రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 13న ఉచితంగా రెడ్డి వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం వ్యవస్థాపకుడు రొద్దం సురేష్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు చంద్రమౌళిరెడ్డి, కార్యదర్శి దుబ్బా కిషోర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురం రూరల్ పాపంపేటలోని సంఘం కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఈ పరిచయ వేదిక జరుగుతుందని పేర్కొన్నారు. పిల్లలకు వివాహాలు చేయాలనుకునే రెడ్డి కులస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువతీ, యువకుల బయోడేటాలు తీసుకురావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94415 75641, 93902 84296, 94907 67224 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శ్రీహర్ష

రాప్తాడు: శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా సత్ప్రవర్తనతో మెలగాలని రాప్తాడు సీఐ శ్రీహర్ష హెచ్చరించారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ప్రసన్నాయపల్లికి చెందిన పలువురు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరిలో మార్పు రావాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలతో పాటు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదన్నారు. సత్ప్రవర్తనతో ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు. ఫ్యాక్షన్ లో కూరుకుపోయి జైలు పాలైన వారి నుంచి పాఠాలు నేర్చుకోవాలన్నారు. రౌడీషీటర్లపై నిత్యం నిఘా ఉంటుందని.. బుద్ధిగా మసలుకోవాలన్నారు.

పాఠశాలకు టీవీ వితరణ



స్మార్ట్ టీవీ అందజేస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రోగ్రాంలో భాగంగా అనంతపురం రూరల్ మండలం తాటిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ. 1.70 లక్షల విలువ చేసే డిజిటల్ స్మార్ట్ బోర్డ్ టీవీ వితరణ చేశారు. స్మార్ట్ టీవీని ఏఐ టెక్నాలజీతో అన్ని సబ్జెక్టులు బోధన చేసే వీలుంటుందని ఐటీసీ జిల్లా కో–ఆర్డినేటర్ దరగయ్య తెలిపారు. ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ఐటీసీ సహకారంతో టీవీ అందజేయడం జరిగిందన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి, ఐజీడీ ఉద్యోగి కె.సుదర్శనరెడ్డి చొరవతో ఈ టీవీని పాఠశాల హెచ్‌ఎం రామకుమార్, ఉపాధ్యాయుడు అశోక్‌కుమార్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. పాఠశాల పూర్వ విద్యార్థి చొరవను ప్రశంసించారు. కార్యక్రమంలో ఐజీడీ ఉద్యోగులు మహమ్మ, పోతలయ్య, రోహిన, రమణమ్మ పాల్గొన్నారు.

రోడ్లు ఛిద్రం.. ప్రయాణం నరకం



పైప్‌లైన్ కోసం తారు రోడ్డును ధ్వంసం చేసిన దృశ్యం



రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



పాతూరు తిలక్ రోడ్డులో కంకర తేలిన దృశ్యం

నగరంలో పైప్‌లైన్ పనుల కోసం రోడ్లను యథేచ్ఛగా ధ్వంసం చేస్తున్నారు. రోడ్లు దెబ్బతినడంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. నగరంలోని తిలక్ రోడ్డులో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు వేగవంతంగా పనులు జరిగేలా చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. తమకేం పట్టదన్న ధోరణితో వ్యవహరిస్తుండటం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. ఇప్పటికైనా అధికారులు మేలుకుని తగు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

బడుగుల ఆశాజ్యోతి పూలే



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, చిత్రంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగులు



ఎస్కేయూ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించిన వీసీ అనిత, తదితరులు

అనంతపురం సిటీ: బలహీనవర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ మహమ్మద్ వసీం సలీం అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని అనంతపురంలోని జెడ్పీ క్యాంపస్‌లో ఉన్న ఆయన విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గిరిజమ్మ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. భారత సామాజిక చరిత్రలో జ్యోతిరావు పూలేకి సామాజిక పునర్నిర్మాణవేత్తగా సముచిత స్థానం ఉందన్నారు. స్త్రీ విద్య ఆవశ్యకతను గుర్తించి పోరాడిన గొప్ప మహనీయుడని కొనియాడారు. పూలే ఆశయాలు సజీవమని.. వాటిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఆయన అడుగుజాడల్లో నేటి తరం నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్, వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ రిజ్వాన్, కార్పొరేటర్ శ్రీనివాసులు, నాయకులు చింతకుంట మధు, లక్ష్మణ్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో..

అనంతపురం టౌన్: కుల వివక్షతపై పోరాడిన మహాత్మా జ్యోతిరావు పూలే అడుగు జాడల్లో నడవాల్సిన అవసరం ఉందని విద్యుత్ శాఖ ఎస్‌ఈ శేషాద్రి శేఖర్ అన్నారు. శుక్రవారం ఎస్‌ఈ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యుత్ శాఖ ఈఈలు జేవీ రమేష్, ప్రసాద్, ఏఓ రాజశేఖర్, గంగన్న, రాము పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో..

అనంతపురం టవర్‌క్లాక్: బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు కష్టపడి పాటుపడిన వ్యక్తి మహాత్మ జ్యోతి రావు పూలే. ఆయన ఆశయాలను కొనసాగించాలని బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు సాకే నరేష్ సూచించారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బోరంపల్లి ఆంజనేయులు గుజ్జల పోతలయ్య, శ్రీధర్, నారాయణ స్వామి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

అనంతపురం రూరల్: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగిస్తాం. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌బాబు అన్నారు. శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు నాగభూషణం, చంద్రాచర్ల హరి, సురేంద్రగౌడ్ పాల్గొన్నారు.

ఎస్కేయూలో..

అనంతపురం: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత అన్నారు. ఎస్కేయూలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఎస్కేయూ ప్రధాన ద్వారం వద్ద సూపరింటెండెంట్ ఎంఏ లక్ష్మణరావు ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు.

వ్యాపార నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: డిజిటల్ యుగంలో మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెట్టి అభివృద్ధి వైపు అడుగులు వేయాలని ఎస్కే యూనివర్సిటీ రిజిస్ట్రార్ రమేష్ బాబు సూచించారు. స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో రెండు రోజుల జరగనున్న కామర్స్, మేనేజ్‌మెంట్ జాతీయ కాన్ఫరెన్స్ శుక్రవారం ప్రారంభమైంది. తొలిరోజు 'బిజినెస్ ఎడ్యుకేషన్ ఇన్ డిజిటల్ ఎరా, ఎమర్జింగ్ ఇష్యూస్ అండ్ ఛాలెంజెస్ ఏహెడ్' అంశంపై సదస్సు జరిగింది. కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత వ్యాపార రంగంలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాముఖ్యతను వివరించారు. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ సీనియర్ ప్రొఫెసర్ బి.రాజశేఖర్ మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో విద్యార్థులు విజయాన్ని సాధించే ప్రక్రియలో సాంకేతికత అనేది కీలక భూమిక పోషిస్తుందన్నారు. కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు వ్యాపార నైపుణ్యాలను ఎలా మెరుగు పరచుకోవాలో తెలియజేశారు. కార్యక్రమంలో కేంద్రియ విశ్వ విద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ రంగనాథం, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.జయప్రద, బి.షర్మిల రామయ్య, రిటైర్డ్ ప్రొఫెసర్ ఏవీ రమణ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఏఓ శ్రీనాథ్, కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వినయ్ కుమార్ పాల్గొన్నారు.

సామాజిక చైతన్య యాత్రకు శ్రీకారం



జెండా ఊపి సామాజిక చైతన్య యాత్రను ప్రారంభిస్తున్న డాక్టర్ ప్రసన్న

అనంతపురం సిటీ/అనంతపురం అర్బన్: దళితవాడల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం సామాజిక చైతన్య యాత్రకు శ్రీకారం చుట్టినట్లు డాక్టర్ ప్రసన్న తెలిపారు. జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నుంచి ఈ నెల 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వరకూ (నాలుగు రోజులు) జిల్లా వ్యాప్తంగా సామాజిక చైతన్య యాత్ర కొనసాగుతుందని ప్రకటించారు. తొలుత అనంతపురంలోని జెడ్పీ క్యాంపస్‌లో ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా, కేవీపీఎస్ ఆధ్వర్యంలో ×జ్యోతిరావు పూలే, అంబేడ్కర్‌ను స్మరించుకుందాం. సామాజిక న్యాయాన్ని సాధిద్దాం₹ అనే నినాదంతో చేపట్టిన సామాజిక చైతన్య యాత్ర ఉద్దేశాన్ని డాక్టర్ ప్రసన్న వివరించారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, జిల్లా అధ్యక్షురాలు శ్యామలమ్మ, ట్రెజరర్ చంద్రిక, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిద్ధు, పరమేశ్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్ పాల్గొన్నారు. దళితవాడల్లో కనీస సౌకర్యాలు కరువై అక్కడి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు చిన్నారులు, మహిళలపై లైంగిక దాడులు ఎక్కువైపోయయని ఆందోళన వ్యక్తం చేశారు. మహాత్మ జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ కలలుగన్న సామాజిక న్యాయం అందనంత దూరంలో ఉందని వాపోయారు. దళితుల సమస్యలను అధ్యయనం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్న ఉద్దేశంతోనే ఈ యాత్రకు శ్రీకారం చుట్టినట్లు ప్రతినిధులు ప్రకటించారు. తొలి రోజు పది గ్రామాల్లో పర్యటించి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నట్లు ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి తెలిపారు.

కొత్త నిబంధనలు ఇస్లామిక్ స్ఫూర్తికి విరుద్ధం



డీఆర్‌ఓ మలోలకు వినతిపత్రం అందజేస్తున్న యూజేఏసీ నాయకులు

అనంతపురం అర్బన్: వక్ఫ్ సవరణ చట్టంలోని కొత్త నిబంధనలు ఇస్లామిక్ వక్ఫ్ వ్యవస్థ విలువలు, స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని తాము భావిస్తున్నామని యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ (యూజేఏసీ) కన్వీనర్ జాఫర్ అన్నారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా శుక్రవారం కలెక్టరేట్ ఎదుట యూజేఏసీ ఆధ్వర్యంలో ముస్లిం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డు సవరణ చట్టం ఇస్లామిక్ వ్యవస్థకు విరుద్ధంగా ఉందన్నారు. భారత పౌరులుగా ఇస్లాం, ఇస్లామిక్ ప్రతిపాదిత వక్ఫ్ సవరణ చట్టం గురించి పార్లమెంట్ చర్చలతో పాటు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న అధికారిక వెర్షన్ నుంచి కొత్త నిబంధనలను జాగ్రత్తగా చదివి అర్థం చేసుకున్నామన్నారు. ఇస్లాంలో వక్ఫ్‌కు సంబంధించి ప్రాథమిక అంశాలపై లోతైన ఆలోచన చేసినట్లు తెలిపారు. సవరణలోని అన్ని కొత్త నిబంధనలు ఇస్లామిక్, వక్ఫ్ వ్యవస్థ స్ఫూర్తికి విరుద్ధమని విశ్వసిస్తున్నామన్నారు. ఈ చట్టం ఏ రూపంలోనూ ఆమోదయోగ్యం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌ఓ ఎ.మలోలకు వినతిపత్రం అందజేశారు. తమ విజ్ఞప్తిని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో యూజేఏసీ సభ్యులు మేయర్ వసీం, నదీమ్ అహమ్మద్, కేఏఎస్ రిజ్వాన్, ఎస్.మహబూబ్ బాషా, బాకే హబీబుల్లా, కె.అల్లీపీరా, ఎస్.బాషా, ఎం.సైపుల్లాబేగ్, పి.దాదాఖలందర్, వేమల నదీమ్, తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫీజు చెల్లింపు గడువు పొడిగించాలి



రిజిస్ట్రార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు

అనంతపురం: ఇంజినీరింగ్ విద్యార్థులకు సెమిస్టర్ ఫీజు చెల్లింపు గడువు పొడిగించాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్యకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఫీజుల వేధింపులకు పాల్పడుతున్న ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జేఎన్‌టీయూ అనంతపురం యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసినా.. రాజకీయ అండదండలతో ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు పేద, మధ్య తరగతి విద్యార్థులను బెదిరించి డబ్బులు దండుకుంటున్నాయని మండిపడ్డారు. సంపద సృష్టి అంటే విద్యార్థులకు పరీక్ష ఫీజుల జరిమానా విధించడమా? అని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేక విద్యార్థుల మీద కూటమి ప్రభుత్వం కక్ష గడుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు నగర అధ్యక్షుడు కైలాష్, వెంకట్, శేఖర్, వంశీ నాయుడు, నరేందర్ రెడ్డి, సాకే మురళి, గంగ శివుడు, సూర్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలను పటిష్టం చేయాలి



కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివ్‌నారాయణ్‌శర్మను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలోని 108 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటీకరణ పూర్తి చేసుకుని రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలవడానికి దోహదపడిన కలెక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మను జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ), సహకార శాఖ అధికారులు సన్మానించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ మినీకాన్ఫరెన్స్‌లో డీసీసీబీ సీఈఓ కె.సురేఖారాణి, డీసీఓ అరుణకుమారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేశారు. అనంతరం కలెక్టర్, జేసీకు శాలువాలు కప్పి సత్కరించారు. సహకార సంఘాలను మరింత పటిష్టం చేసి రైతులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్, జేసీ సూచించారు. సహకార పరపతి సంఘాల్లో ఇక నుంచి మాన్యువల్ పద్ధతిలో కాకుండా ఆన్‌లైన్‌లో లావాదేవీలు, కార్యకలాపాలు నిర్వహించాలని ఆదేశించారు.

చేతుల శుభ్రతతో ఆరోగ్యం



చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మి

రాప్తాడురూరల్: మంచి అలవాట్లు జాతి పురోగతికి మెట్లు అని ఐసీడీఎస్ అనంతపురం రూరల్ సీడీపీఓ ధనలక్ష్మి పేర్కొన్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అనంతపురం రూరల్–5 సెక్టార్ పరిధిలోని సుఖదేవ్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ధనలక్ష్మి మాట్లాడుతూ.. చిన్నారుల చేతుల పరిశుభ్రత గురించి తల్లులకు వివరించారు. చేతుల శుభ్రతతోనే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. చిన్నారులు ఆడుకున్న తర్వాత భోజనం చేయడానికి ముందు కచ్చితంగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. కౌమార దశలో ఉన్న అమ్మాయిలకు గర్భిణులకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు మొదటి ఆరు నెలలు కేవలం తల్లి పాలు పట్టించాలన్నారు. బిడ్డకు ఆరు నెలలు పూర్తయిన తర్వాత ఆహారంలో వైవిధ్యత, అనగా బిడ్డకు అన్ని రకాల ఆహార పదార్థాలు తినిపించేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ, అంగన్వాడీ వర్కర్లు రేణుక, రామాంజనమ్మ పాల్గొన్నారు.

ఆత్మకూరు: తల్లీబిడ్డల సంక్షేమమే పోషణ పక్వాడా లక్ష్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవాణి తెలిపారు. శుక్రవారం మండలంలోని బి.యాలేరు గ్రామంలో గర్భవతులకు పోషణ పక్వాడాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణి దశ నుంచి రెండేళ్ల వరకు తల్లీబిడ్డల ఆరోగ్య స్థితిని మెరుగుపరిచే విధంగా వెయ్యి రోజుల పాటు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గర్భిణిగా ఉన్నప్పుడు పౌష్టికాహారం తీసుకుంటే బిడ్డ పెరుగుదల వేగంగా ఉంటుందని తెలిపారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ 11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఈఈ జేవీ రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వేణుగోపాల్ నగర్, వినాయక్ నగర్, రాణినగర్, భాగ్యనగర్, గుత్తిరోడ్డు, శ్రీనగర్ కాలనీ, స్టేట్ బ్యాంక్ కాలనీ, 80 ఫీట్ రోడ్డు, ద్వారకా నగర్, బళ్లారి రోడ్డు, తపోవనం, స్టాలిన్ నగర్, లలితా నగర్, పాపంపేట, లక్ష్మీనగర్, హౌసింగ్ బోర్డు, విద్యుత్ నగర్, అరవింద్ నగర్, నాయక్ నగర్, ఆదర్శ నగర్, ఆర్టీఓ కార్యాలయం, భైరవ నగర్, జెడ్పీ కార్యాలయం, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల, రామచంద్రా నగర్, శ్రీనివాస నగర్, రెవెన్యూ కాలనీ, సంఘమేష నగర్ సర్కిల్, వినాయక్‌నగర్, పాతూరు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల ప్రజలు గమనించాలని కోరారు.

రాప్తాడు మండలంలో..

రాప్తాడు: హంపాపురం, గాండ్లపర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శివ ప్రసాద్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

మాతా, శిశు మరణాల నివారణకు కృషి

అనంతపురం మెడికల్: మాతా, శిశు మరణాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో గత నెలలో జరిగిన 15 శిశు, ఒక మాతృ మరణంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుఖ ప్రసవం పొందేలా చూడాలన్నారు. మాతా, శిశు మరణాల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ యుగంధర్, వైద్యులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ అరుణలత, డాక్టర్ బాబ్జాన్, ఎంపీహెచ్‌ఈఓ లక్ష్మణ్ణ పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ బాలికల విభాగం రాష్ట్ర కో-కన్వీనర్‌గా రాధాజ్యోతి

అనంతపురం ఎడ్యుకేషన్: ఏఐఎస్‌ఎఫ్ బాలికల విభాగం రాష్ట్ర కో–కన్వీనర్‌గా జిల్లాకు చెందిన రాధాజ్యోతిని ఎన్నుకున్నారు. విజయవాడలో జరిగిన ఏఐఎస్‌ఎఫ్ బాలికల విభాగం రాష్ట్రస్థాయి సమ్మేళనం రాధాజ్యోతితో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులుగా మౌళి చందనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో రోజురోజుకూ మహిళలపై అత్యాచారాలు, దాడులు పెరుగుతున్నాయన్నారు. వీటిని అరికట్టేందుకు విద్యార్థినులతో కలిసి పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు గ్రామంలో శుక్రవారం పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎర్రిస్వామి మాట్లాడుతూ.. వేసవి కాలంలో భక్తులు ఇబ్బందులు పడకుండా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శిరీష పాల్గొన్నారు.

నైపుణ్య కోర్సులతో ఉపాధి అవకాశాలు

ఆత్మకూరు: విద్యతో పాటు నైపుణ్య కోర్సులు కూడా నేర్చుకోవడం మంచిది. భవిష్యత్‌తో ప్రతి ఒక్కటి ఉపయోగపడుతాయని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మధుసూధన్‌రావు తెలిపారు. శుక్రవారం ఇంటర్న్‌షిప్‌లో భాగంగా స్థానిక స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు బ్యాంకింగ్ ఫైనాన్షియల్‌పై ఎస్‌బీఐ మేనేజర్ చంద్రశేఖర్ అవగాహన కల్పించారు.

వైఎస్ జగన్‌తోనే ముస్లింలకు న్యాయం



సాదిక్‌వలిని సన్మానిస్తున్న రహమతే మసీదు నూతన కమిటీ సభ్యులు

అనంతపురం రూరల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ముస్లింలకు అన్ని విధాలా న్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సాదిక్‌వలి అన్నారు. శుక్రవారం రుద్రంపేట పంచాయతీ చంద్రబాబునగర్‌లో ఉన్న రహమతే మసీదు నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు సాదిక్‌వలి, రుద్రంపేట ఎంపీటీసీ సభ్యురాలు మహబూబీని కలసి కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సాదిక్‌వలి మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడంతో పాటు అన్ని విధాలా అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ముతవల్లి, అబ్దుల్, షాని ముతవల్లి షెక్షావలి, అక్కమ్మ, వెంకటరాముడు, జయమ్మ, మసీదు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చోరీలు, నేరాల నియంత్రణకు చర్యలు

రాప్తాడు: చోరీలు, నేరాల నియంత్రణకు 44వ జాతీయ రహదారిపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక సీఐ శ్రీహర్షతో కలిసి మండలంలో 44వ జాతీయ రహదారిపై పలు చోట్ల 16 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. రోజు రోజుకూ చోరీలు, నేరాలు పెరుగుతున్నాయన్నారు. నేరగాళ్లు కొత్త ఆలోచనలతో నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. సమాజంలో పెరుగుతున్న కేసుల దృష్ట్యా సీసీ కెమెరాల ప్రాముఖ్యత పెరిగిందన్నారు. చాలా కేసులు ప్రస్తుతం సీసీ ఫుటేజీలతోనే పరిష్కారం అవుతున్నాయన్నారు. జాతీయ రహదారిపై చోరీలు, నేరాలును కట్టడి చేసేందుకే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

సాక్షి ఫ్యామిలీ IV
అనంతపురం
శనివారం ॥ 12-4-2025

కౌంట్ డౌన్

ఐకానిక్ మహిళల అంతరిక్ష యాత్ర

ఐకానిక్ మహిళల అంతరిక్ష ప్రయాణానికి ఏరో స్పేస్ కంపెనీ 'బ్లూ ఆరిజన్' కౌంట్ డౌన్ ప్రారంభించింది. ఆరుగురు సభ్యుల బృందంలో వివిధ రంగాలకు చెందిన ఐకానిక్ మహిళలు ఉన్నారు. ఈ చారిత్రక ఘట్టం ఏప్రిల్ 14న ఆవిష్కృతం కానుంది. భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవడం, అంతరిక్ష పరిశోధనల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని చాటి చెప్పడమే లక్ష్యంగా చేపట్టిన మిషన్ ఇది...



కెరియానే ఫ్లిన్

కెరియానే ఫ్లిన్ నిర్మాత. డాక్యుమెంటరీలు, చిత్రాలు తీసింది. హాలీవుడ్‌లో ఆమె తీసిన దిస్ చేంజెస్ ఎవ్రీ థింగ్ (2018), లిల్లీ (2024) చిత్రాలకు మంచి గుర్తింపు వచ్చింది. ఎన్నో స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేస్తోంది. ఫ్లిన్‌కు అంతరిక్ష ప్రయాణాలపై ఆసక్తి. 'నేను చాలా ఉత్సాహంగా ఉన్నాను' అంటోంది తన అంతరిక్ష ప్రయాణం గురించి.

ఆరుగురు ఐకానిక్ మహిళలను అంతరిక్షంలోకి తీసుకెళ్లే న్యూ షెపర్డ్ స్పేస్ క్రాఫ్ట్ పైలట్ లేకుండానే పనిచేస్తుంది. సబ్ ఆర్బిటల్ ప్రయాణానికి ఆరుగురు ప్రయాణికులను తీసుకెళ్లగలదు. సుమారు 11 నిమిషాల పాటు పయనించి భూమికి 62 మైళ్ల ఎత్తులో ఉన్న కార్మాన్ రేఖను దాటుతుంది. దీన్ని అంతరిక్షానికి ప్రవేశ ద్వారంగా భావిస్తారు.

ఈ ప్రయాణంలో ప్రయాణికులు గాలిలో తేలిపోతున్నట్టుగా అనుభూతిని పొందుతారు. క్యాప్సూల్‌కు సంబంధించిన పెద్ద కిటికీల ద్వారా భూమి విహంగ వీక్షణను ఆస్వాదిస్తారు.

'న్యూ షెపర్డ్ స్పేస్ క్రాఫ్ట్'ను చిన్న చిన్న గగన యాత్రల కోసం రూపొందించారు. ఇది బిఇ-3 పిఎమ్ ఇంజిన్‌తో పని చేస్తుంది. ఈ ఎన్.ఎస్.-31 మిషన్ టెక్నాలజీ ఫీట్ మాత్రమే కాదు ఒక చారిత్రాత్మక ఘట్టం కూడా.

'నా భయాన్ని పోగొట్టుకోవడానికి ధ్యానం చేస్తున్నాను' అంటోంది గేల్ కింగ్.

'కాస్త భయంగా ఉంది. అయినా చాలా ఉత్సాహంగా ఉంది' అంటోంది లారెన్ సాంచెజ్.

ఎవరి అభిప్రాయం ఎలా ఉన్నా ఆరుగురు ఐకానిక్ మహిళల అంతరిక్షయాత్ర హాట్ టాపిక్‌గా మారింది.

అయేషా బోవ్

నాసా మాజీ రాకెట్ శాస్త్రవేత్త అయిన అయేషా బోవ్ మిచిగన్ యూనివర్శిటీ నుండి ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ, స్పేస్ సిస్టమ్స్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతో కలిసి పనిచేసే 'స్టెమ్ బోర్డ్' అనే ఇంజినీరింగ్ కంపెనీకి అయేషా బోవ్ సీఈవో.

అమంద గుయెన్

హార్వర్డ్ సెంటర్ ఫర్ ఆస్ట్రోఫిజిక్స్, ఎంఐటీ, నాసా, ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఆస్ట్రోనాటికల్ సైన్సెస్‌లో పనిచేసింది అమంద గుయెన్. లైంగిక బాధితులకు అండగా నిలబడి పోరాడిన గుయెన్ నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ అయింది. టైమ్ మ్యాగజైన్ 'ఉమన్ ఆఫ్ ది ఇయర్' అవార్డ్‌కు ఎంపికైంది. తొలి వియత్నామీస్, ఆగ్నేయాసియా మహిళా వ్యోమగామిగా ఈ అంతరిక్ష యాత్రతో గుయెన్ చరిత్ర సృష్టించనుంది. 'సేవింగ్ ఫైవ్: ఎ మెమోరియల్ ఆఫ్ హోప్' అనే పుస్తకాన్ని గత నెలలో విడుదల చేసింది.

లారెన్ సాంచెజ్

లారెన్ సాంచెజ్ రచయిత్రి, పాత్రికేయురాలు. ఎన్నో వార్తా సంస్థలలో యాంకర్‌గా పనిచేసింది. లారెన్ హెలికాప్టర్ పైలట్ కూడా. 'బ్లాక్ ఆప్స్ ఏవియేషన్' సంస్థను స్థాపించింది. ఇది మహిళా యాజమాన్యంలో నిర్వహితమవుతున్న తొలి ఏరియల్ ఫిల్మ్ అండ్ ప్రొడక్షన్ కంపెనీ. 'ది ఫ్లై హూ ఫ్లై టు స్పేస్' లాంటి ఎన్నో పిల్లల పుస్తకాలు రాసింది.

గేల్ కింగ్

మేరీల్యాండ్ యూనివర్శిటీ నుండి సైకాలజీలో పట్టా పొందిన గేల్ కింగ్‌కు రేడియో, టెలివిజన్, ప్రింట్ మీడియాలలో నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. 'గేల్ కింగ్ ఇన్ ది హౌజ్' అనే రేడియో షోని హోస్ట్ చేసింది. ఉత్తమ రేడియో టాక్ షో కోసం ఇచ్చే 'అమెరికన్ ఉమెన్ ఇన్ రేడియో అండ్ టెలివిజన్ గ్రేసి అవార్డ్'ను సొంతం చేసుకుంది. టైమ్ మ్యాగజైన్ 'అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల జాబితా-2019'లో చోటు సాధించింది.

కేటీ పెర్రీ

ఆల్ టైమ్ బెస్ట్ సెల్లింగ్ మ్యూజిక్ ఆర్టిస్ట్‌లలో పాప్ స్టార్ కేటీ పెర్రీ ఒకరు. 2010లో విడుదలైన ఆమె మొదటి ఆల్బమ్ రికార్డులు బ్రేక్ చేసింది. 13 గ్రామీ అవార్డ్‌లకు కేటీ నామినేట్ అయింది. బిల్‌బోర్డ్ 'విమెన్ ఆఫ్ ది ఇయర్-2012' అవార్డ్ అందుకుంది. 'ఫైర్ వర్క్ ఫౌండేషన్' మొదలుపెట్టి యునిసెఫ్ గుడ్ విల్ అంబాసిడర్‌గా సేవలు అందిస్తోంది.

ఇల్లు అండగా ఉండాలి


మెనోపాజ్ అర్థం చేసుకుందాం

నిర్వహణ: సరస్వతి రమ

ఏడాది వరకు నెలసరి రాకపోతే అప్పుడు దాన్ని మెనోపాజ్‌గా పరిగణిస్తారు. సాధారణంగా 45 నుంచి 52 ఏళ్ల మధ్య మెనోపాజ్ వస్తుంది. తొలి లక్షణంగా నెలసరి క్రమం తప్పుతుంది. అంటే రెండు నెలలకు ఒకసారి లేదా నాలుగు నెలలకు ఒకసారి వస్తూంటుంది. తర్వాత ఒంట్లో వేడి ఆవిర్లు, నిద్రలేమి, గుండె దడ, అలజడి, ఆందోళన, మూడ్ స్వింగ్స్, ఏకాగ్రత లోపించడం, జీవనాసక్తి తగ్గడం, బరువు పెరగడం, ఒంటరితనం వంటివీ ఉంటాయి. మూడు, నాలుగేళ్ల వరకు కొనసాగే ఈ దశను ప్రీమెనోపాజల్ స్టేజ్ అంటారు. అయితే ఆ ఫేజ్‌లో ఉన్న అందరికీ ఆ లక్షణాలు ఉండకపోవచ్చు. కొందరు ఏ లక్షణమూ లేక సాఫీగా ఆ దశను దాటేయవచ్చు. లక్షణాలు ఉంటే జీవనశైలిలో మార్పులు, యోగా, ఎక్సర్‌సైజ్‌తో మేనేజ్ చేయవచ్చు. ఒకవేళ సమస్య తీవ్రంగా ఉంటే డాక్టర్‌ను సంప్రదించాలి. ముఖ్యమైన విషయం.. మెనోపాజ్ అని నిర్ధారణ అయ్యాక స్పాటింగ్ కానీ, బ్లీడింగ్ కానీ కనిపిస్తే అశ్రద్ధ చేయకుండా వెంటనే గైనకాలజిస్ట్‌ను కలవాలి.

మెనోపాజ్ తర్వాత..

స్త్రీ మేనికి మెరుపు, నిగారింపునిచ్చేవి ఫిమేల్ హార్మోన్సే. మెనోపాజ్ తర్వాత వాటి ఉత్పత్తి లేక గ్లో కూడా తగ్గిపోతుంది. చర్మం సాగి, ముడతలు పడుతుంటుంది. వెజైనా పొడిబారిపోతుంది. లైంగికాసక్తి తగ్గిపోతుంది. బ్లోటింగ్ ఉంటుంది. ఎముకల సాంద్రత తగ్గుతుంది. గుండె సంబంధిత సమస్యలూ మొదలయ్యే చాన్స్ ఉంటుంది. అయితే వీటన్నిటికీ భయపడాల్సిన పనిలేదు. క్రమం తప్పకుండా వాకింగ్, వ్యాయామం చేయాలి. డాక్టర్ సూచనల మేరకు కాల్షియం సప్లిమెంట్స్ తీసుకోవాలి. వెజైనల్ డ్రైనెస్ సమస్య కోసం ప్లాంట్ బేస్డ్ ఈస్ట్రోజన్ మెడిసిన్స్ తీసుకోవచ్చు లేదా జెల్లీని ఉపయోగించొచ్చు. ఆహారంలోనూ జాగ్రత్తలు పాటించాలి. మసాలా, వేపుళ్లకు దూరంగా ఉండాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారపదార్థాలను తీసుకుంటే మంచిది. హెల్త్ చెకప్స్ మరచిపోవద్దు.



డాక్టర్ కామేశ్వరి

మెనోపాజ్ అనేది సవాళ్లతో కూడిన మార్పు! 'శాస్త్రీయ అవగాహన ఉంటే సమర్థవంతంగా ఆ సవాళ్లను ఎదుర్కోవచ్చు.. ఆ మార్పును ఆస్వాదించొచ్చు' అని చెబుతున్నారు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ గైనకాలజిస్టులు డాక్టర్ కామేశ్వరి, డాక్టర్ ఆలియా రెడ్డి!



డాక్టర్ ఆలియా రెడ్డి

❖ ❖ ❖

మామోగ్రఫీ, పాప్‌స్మియర్ పరీక్షలు తప్పనిసరి. ఇంకో విషయం.. సర్వైకల్ క్యాన్సర్ నివారణకు వ్యాక్సీన్ వచ్చింది. కాబట్టి.. పెద్దమనిషి అయిన అమ్మాయిల నుంచి 45 ఏళ్ల మహిళల వరకు ఈ వాక్సీన్‌ను తీసుకోవచ్చు. లైంగిక జీవితం మొదలుకాకముందే ఈ వాక్సీన్ తీసుకుంటే మంచిది.

❖ ❖ ❖

మెనోపాజ్ మూడు రకాలుగా వస్తుంది. ఒకటి.. సహజంగా వయసుతో వచ్చేది. రెండు.. వయసుతో సంబంధం లేకుండా జీవనశైలిలో మార్పులు, పొల్యూషన్, పెస్టిసైడ్స్ ఫుడ్ లాంటి వాటితో 40 ఏళ్లలోపే వచ్చే అర్లీ మెనోపాజ్. మూడవది.. శస్త్రచికిత్స ద్వారా గర్భసంచి, అండాశయాలను తొలగించడం వల్ల, క్యాన్సర్‌కు వాడే కొన్నిరకాల మందులు, రేడియేషన్ వల్ల కృత్రిమంగా వచ్చే మెనోపాజ్.

❖ ❖ ❖

మెనోపాజ్ లక్షణాల్లో ఒకటైన హాట్ ఫ్లషస్‌ను యూరప్, ఉత్తర అమెరికా దేశాలలో 60-90 శాతం మంది స్త్రీలు ఎదుర్కొంటున్నారని, వారితో పోలిస్తే ఆసియా ఖండంలో 10-20 శాతం మంది మహిళలు మాత్రమే ఈ సమస్యతో సతమతమవుతున్నారని అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. అందుకు ఆసియా ఖండంలోని ఆహారపు అలవాట్లు అంటే వారు తీసుకునే ఆహారంలోని ప్లాంట్ బేస్డ్ ఈస్ట్రోజన్స్ కారణం కావచ్చని పరిశోధనలు చెబుతున్నాయి. ఆ దేశాల్లో మెనోపాజ్ సమస్యలతో తీవ్రంగా బాధపడుతున్నవారు కౌన్సెలింగ్, జీవనశైలిలో మార్పులతో ఆ దశను సమర్థంగా ఎదుర్కొంటున్నారట. ధూమపానం, పొగాకు, ఊబకాయం, స్పైసీ ఫుడ్, పొగలుగక్కే ఆహారం తినడం, కాఫీ, టీలు ఎక్కువగా తాగడం, మద్యం, థైరాయిడ్ గ్రంథి లోపాలు, డయాబెటిస్, మానసిక ఒత్తిడి వంటివన్నీ హాట్‌ఫ్లషస్‌కి ప్రేరకాలు (ట్రిగర్) గా పనిచేస్తాయి. అయితే జీవనశైలిలో మార్పులు, వైద్య సలహా సూచనలతో ఆ సమస్యను అధిగమించవచ్చు. అంతేకాదు నువ్వులు, గడ్డి నువ్వులు, అవిసె గింజలు, సోయా బీన్స్, ముల్లంగి, నట్స్, క్యాబేజీ, కాలిఫ్లవర్ వంటివాటితోనూ మెనోపాజ్ సమస్యలను తగ్గించుకోవచ్చు.



మినీ మాథూర్

శిల్పా శెట్టి మొదలు ట్వింకిల్ ఖన్నా, శ్వేతా బచ్చన్ (జయ బాధురి, అమితాబ్ బచ్చన్‌ల కూతురు), టెలివిజన్ హోస్ట్ మినీ మాథూర్ లాంటి వాళ్లందరూ హాట్ ఫ్లషస్, మూడ్ స్వింగ్స్, బరువు పెరగడం వంటి సమస్యలను ఎదుర్కొన్నవారే. ఆ లక్షణాల గురించి అవగాహనలేక చాలా ఇబ్బందులు పడ్డారట. వాళ్ల మూడ్ స్వింగ్స్‌ని చూసి కుటుంబ సభ్యులు నివ్వెరపోయేవారని, తామెందుకలా ప్రవర్తిస్తున్నామో అర్థంకాక .. ఆ పరిస్థితిని ఎలా మేనేజ్ చేయాలో తెలియక ఆందోళన చెందారని చెప్పారు. ఆ బాలీవుడ్ సెలెబ్స్ అందరూ ఇప్పుడు మెనోపాజ్ అవేర్‌నెస్ ప్రచారకర్తలుగా మారారు. మెనోపాజ్ దశ, లక్షణాల మీద విస్తృతంగా చర్చిస్తూ మహిళల్లో అవగాహన తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

❖ ❖ ❖

శాస్త్రీయ అవగాహన పెంచుకుంటూ..

ఇక్కడ అర్థం చేసుకోవాల్సిన విషయం ఒక్కటే.. మెనోపాజ్ అన్నది స్త్రీ జీవితంలో ఒక సహజమైన ప్రక్రియ. దాన్నో జబ్బుగా పరిగణించకుండా శాస్త్రీయ అవగాహనను పెంచుకుంటూ కుటుంబం ఆమెకు అండగా నిలబడాలి. జీవిత భాగస్వామి ఆమెకు ఓ ఫ్రెండ్‌గా మారాలి. పిల్లలు అమ్మ మానసిక పరిస్థితిని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాలి. ఆమెకు అనుకూలంగా మెలగాలి. ఇలాంటి వాతావరణం ఉంటే.. అది ఆమెకు హార్మోన్స్ కన్నా ప్రభావవంతంగా పనిచేస్తుంది. మెనోపాజ్ మీద సమాజంలోనూ అవగాహన పెరగాలంటే ఆరోగ్యశిబిరాల్లో దాని మీద చర్చించాలి. మీడియా కథనాల ద్వారా ప్రచారం జరగాలి. అంతేకాదు మహిళ ఆరోగ్యాన్ని పాఠ్యాంశాల్లోనూ భాగం చేయాలి.

– శిరీష చల్లపల్లి

వంటిల్లు

ముంజెల మాధుర్యం



వేసవిలో మాత్రమే దొరికే తాటి ముంజెలంటే చాలామందికి భలే ఇష్టముంటుంది. అయితే అంత మధురమైన ముంజెలను మరింత మధురంగా చేసుకోవడం ఎలా? ఈజీగా, టేస్టీగా ఇలా ట్రై చేస్తే సరి పిల్లలేంటి... పెద్దలు కూడా ఇష్టంగా లాగించేస్తారు.

తాటి ముంజెల హల్వా



ముందుగా చిన్నమంట మీద కళాయిలో 2 కప్పుల చిక్కటి పాలు మరిగించి, అందులో దోరగా వేయించిన ఒక కప్పు గోధుమ పిండి వేసుకుంటూ గరిటెతో ఉండలు కట్టకుండా కలుపుకోవాలి. అనంతరం దానిలో రెండు కప్పుల మెత్తటి ముంజెల గుజ్జు వేసుకుని దగ్గరపడే వరకూ తిప్పాలి. అభిరుచిని బట్టి కొద్దిగా ఫుడ్ కలర్, రెండు టేబుల్ స్పూన్ల నెయ్యితో పాటు ఏలకుల పొడి, వేయించిన బాదం, జీడిపప్పు వంటివి కలిపి దగ్గరపడ్డాక ఒక పాత్రలోకి తీసుకోవాలి. ఆ మిశ్రమం బాగా చల్లారాక ముక్కలుగా కట్ చేసుకుని ఆరగించొచ్చు.

తాటి ముంజెల జ్యూస్



ముంజెకాయల గుజ్జులో కొద్దిగా నీళ్లు, తేనె వేసి బాగా మిక్సీ పట్టుకోవాలి. వడకట్టి చల్లగా తాగాలి. ఏలకుల పొడి వేసుకుంటే ఫ్లేవర్ మరింత బాగుంటుంది.

తాటి ముంజెల ఐస్ క్రీమ్



రెండు కప్పు ముంజెల గుజ్జు, అర కప్పు కాచిన చిక్కటి పాలు, అర కప్పు పాల పొడి, రెండు టేబుల్ స్పూన్ల ఫ్రెష్ క్రీమ్ లేదా విప్పింగ్ క్రీమ్, సరిపడా పంచదార కలిపి బాగా గిలకొట్టాలి. లేదా మిక్సీ పట్టాలి. ఇప్పుడు ఆ మిశ్రమాన్ని డీప్ ఫ్రీజర్‌లో పెట్టి, గడ్డకట్టాక తింటే సూపర్ ఉంటుంది.

వీధి నుంచి ఇంటికి

నేడు స్ట్రీట్ చిల్డ్రన్ డే



వీధి బాలలు

మన ఉరుకుల పరుగుల జీవనంలో ఒక్క కుదుపుతో ఆపే రెడ్ సిగ్నల్‌లా బాల్యం కూడలిలో భిక్షం ఎత్తుతూ కనిపిస్తుంది. జాతరలా తోసుకువెళుతున్న సమూహంలో నిలువెల్లా రంగు పూసుకుని చేతి కర్రతో గాంధీ తాతలా బాల్యం నిగ్గదీస్తుంది. చిన్న బొజ్జను నింపుకోలేని చిట్టి చేతులతో జీవితంతో పోరాడలేక దొంగ అవుతుంది, దోపిడీకి గురవుతుంది. బాలనేరస్తులుగా ముద్ర వేయించుకొని భవిష్యత్తును బందిఖానాలా మార్చుకుంటుంది.

దేశవ్యాప్తంగా నాలుగు లక్షల మంది వీధి బాలలు ఉన్నట్టు యునిసెఫ్ అంచనా. హైదరాబాద్‌లో 28,000కు పైగా వీధి బాలలు ఉన్నట్టు అంచనా. పాట్నా పట్టణంలో వీధి బాలల సంఖ్య ఎక్కువ.

వీధి బాల్యం ఎందుకు పెరుగుతోందంటే..

గ్రామాల నుంచి పట్టణ ప్రాంతాలకు బతుకు దెరువు కోసం వలస వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. పనులు దొరక్క, నిలువనీడ లేక, కనీస అవసరాలు తీరక తల్లిదండ్రులు గొడవలు పడటం, విడిపోవడం, కుటుంబాలు విచ్ఛిన్నమవడంతో దిక్కుతోచని స్థితిలో పిల్లలు రోడ్ల మీదకు వస్తున్నారు. మన దేశంలో గుర్తించినవే కాదు గుర్తింపునకు నోచుకోని స్లమ్స్ చాలా ఉన్నాయి. వీటిల్లో నివాసం, ఆహార భద్రత లేమి, చదువునూ దూరం చేస్తుంది. ఇప్పటికే వీధి బాలల్లో 82 శాతం మంది చదువును ఆపేశారని నివేదికలు చూపుతున్నాయి. వీరంతా జీవనోపాధి కోసం చిత్తు కాగితాలు ఏరుకోవడం, కూలి పనులు, భిక్షాటన, షూ పాలిష్, పూలు అమ్మడం.. వంటి వాటిని ఎంచుకుంటుంటే కొంతమంది దొంగతనం, చైన్ స్నాచింగ్, పిక్ పాకెటింగ్, మాదక ద్రవ్యాల వ్యాపారం.. మొదలైన చట్ట వ్యతిరేక పనుల్లో పాల్గొంటున్నారు. హెచ్ఐవి/ఎయిడ్స్ బారిన పడటం, ఆడపిల్లలు చిన్నవయసులోనే గర్భం దాల్చడం, గర్భస్రావాలు.. వంటి సమస్యలనూ ఎదుర్కొంటున్నారు.

సమాజంలో వీధి బాలల పట్ల ఉన్న వ్యతిరేకతను దూరం చేయడానికి అవగాహన శిబిరాలను ఏర్పాటు చేయడం, మహిళలకు, యువతకు జీవన నైపుణ్యాలలో శిక్షణ ఇవ్వడం తప్పనిసరిగా చేయాల్సిన పనులుగా వివరించారు. ఇందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, సమాజంలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలి.

ఆత్మీయ ఆహ్వానం

వీధి బాలల కోసం కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థల్లో రెయిన్ బో హోమ్స్ ఒకటి. ఈ హోమ్స్ హైదరాబాద్‌లో 14 ఉంటే, దేశ వ్యాప్తంగా 50 వరకు ఉన్నాయి. ఒక్కో హోమ్‌లో 70 నుంచి 80 మంది పిల్లలు సంరక్షణను పొందుతున్నారు. రోడ్డు మీద నుంచి హోమ్‌లోకి వచ్చే పిల్లలకు సంరక్షణ పొందుతున్న పిల్లలు ఆత్మీయ ఆహ్వానం పలుకుతారు. 'తమ కుటుంబంలో చేరిన కొత్త వారిని తోబుట్టువుల్లా దగ్గరకు తీసుకుంటారు' అని తెలిపారు నిర్వాహకులు.

మూలాన్ని సమీక్షించాలి...

సుమతి చదువుకోలేదు. గ్రామీణ నేపథ్యం. తన ఈడు వయసున్న అతన్ని ప్రేమించి, కుటుంబాన్ని వదిలేసి అతనితో పాటు పట్టణం వచ్చేసింది. కొంతకాలం బాగానే ఉన్నా చెడు అలవాట్లకు బానిసైన అతను ఆమెను, పుట్టిన బిడ్డనూ వదిలేసి ఎటో వెళ్లిపోయాడు. దీంతో సుమతిది మానసిక కుంగుబాటు. ఎలా బతకాలో తెలియని నిస్సహాయ స్థితి. బిడ్డను కాపాడుకోవడానికి ఎక్కడెక్కడో తిరిగి, సెక్స్‌వర్కర్‌గా మారింది. 'ఇలాంటి వారిని గుర్తించి తల్లికి, బిడ్డకు సంరక్షణను అందించే బాధ్యతను తీసుకున్నామని తెలిపారు రెయిన్ బో హోమ్స్ డైరెక్టర్ అనూరాధ. ఇలాంటి వేదనాభరితమైన జీవన కథనాలెన్నో సమాజంలో ఉన్నాయని, స్ట్రీట్ చిల్డ్రన్స్ సంరక్షణ విధానాల గురించి అనూరాధ వివరించారు.

చిన్న భరోసా!



దేశవ్యాప్తంగా వివిధ సమస్యలను ఎదుర్కొంటున్న 18 లక్షల మంది పిల్లలను గుర్తించాం. 6 నుంచి 18 ఏళ్ల వరకు ఉన్న వీధి బాలలను సంరక్షించి ఆ తర్వాత వదిలేయకుండా 23 ఏళ్ల వరకు స్కిల్స్ అందించి, భవిష్యత్తు బాగుండేలా చూస్తున్నాం. కొన్ని వేల మంది పిల్లలు చదువుకొని, వివిధ నైపుణ్యాలు పెంచుకొని తమ జీవితం తాము ఆనందం గడుపుతున్నారు. నర్సులుగా, వివిధ రంగాలలో ఉద్యోగాలు చేస్తున్నవారూ, ఉన్నవారు,, పెళ్లి చేసుకొని తమ పిల్లలకు మంచి భవిష్యత్తును అందిస్తున్న వారున్నారు. మా చేయూతతో తమ బాల్యంలోని చేదును దూరం చేసుకొని, బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు.

– అనూరాధ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, రెయిన్ బో హోమ్స్

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి